# సంక్రాంతి ఉత్తరం

శ్రీమతి శ్రీనివాసపురం
సరస్వతి

జానకిరామయ్య యింట్లో అడుగు పెట్టగానే భార్యమీద విరుచుకుపడ్డాడు. "నేను మొదటే చెప్పా!—ఆ ముష్టి సంబంధం మన కొద్దే అని. నువ్వేమన్నా విన్నావా ? . . . ఇప్పు డఘోరించు" అని.

"ఏ సంబంధాన్ని గురించీ మీ రనేది ?—అస లింతకీ ఏం జరిగింది ? అలా విరుచుకు పడు తున్నారు" సావిత్రమ్మ సౌమ్యంగానే అడిగింది.



"ఇంకా ఏ సంబంధ మంటా వేమిటి ? అదే!—నీ ముద్దుల కూతురి సంబంధం. వాళ్ల గురించి ఎన్ని చెప్పాను! అసలు నా మాటకు నువ్వు నయా పైస విలువేనా యిచ్చావూ ? 'అమ్మాయి ఒప్పు కుంది—అమ్మాయి ఒప్పుకుంది' అని అఘో రించావు . . . నామాటగనక వినివుంటే యిప్పు డిట్లా జరిగివుండేదా ?— ఆ సుందరరామయ్య గారి అబ్బాయి కేం తక్కువైందని ? . . రూపం లేదా ? . . . చదువు లేదా ? . . . సంపాదన లేదా? ఏం లేదు? చక్కగా ఇంటరు ప్యాసై నెలకు నూటా పాతిక రాళ్లు వచ్చే గౌరవమైన ఉద్యోగమే చేస్తున్నా అతడెందుకు నీకు వచ్చలేదూ అంట ?—ఆ సంబంధం కాదని నువ్వు యితని కిచ్చి చేసి, బాము కుందేమిటి ? ఇదేకద!—" అంటూ జానకి రామయ్య కోపంగా చేతిలో ఉన్న ఓ కవరు భార్య ముందు పడేట్టుగా విసిరి పారేశాడు.

సావిత్రమ్మ వంగి ఆ కవరందుకుంటూ—"అయిపోయిం దేదో అయిపోయింది. దాన్ని గురించి యిప్పు డెందుకు ? అసలేం జరిగిందో చెప్పకుండా అలా అరవడ మెందుకు ?" అంది.

"ఏం జరిగిందో యింకా నేను చెప్పడమెందుకు? నువ్వే చదివి చూడు తెలుస్తుంది!" అన్నాడు కోపాన్ని తగ్గించుకోకుండానే.

సావిత్రమ్మ కాగితం తీసి చదువుకోసాగింది.

"పూజ్యులైన మామగారి చరణ కమలములకు తమ అల్లుడు లక్ష్మీనారాయణ అనేక నమస్కార ములు. మీరు నన్నూ చి. సౌ.పద్మావతినీ 'సంక్రాం తికి' ఆహ్వానిస్తూ రాసిన ఉత్తరం అందింది. మీ కోరిక ప్రకారం ఆహ్వానాన్ని అంగీకరించలేక పోతున్నందుకు క్షమించ ప్రార్థన! నేను రావడానికి మా తల్లిదండ్రు లంగీకరించలేదు. కారణం—మీరు అల్లునికియివ్వాల్సిన అలంకారాల్లో ఏ ఒక్కటీ నాకు యివ్వలేదట. కనీసం రిస్టువాచీ అయినా యివ్వకపోవడం అనేది చాలా శోచనీయంగానూ, చిన్న తనంగానూ వుందట. అల్లుడికి ఏ మలంకార మిచ్చారు ? అని అన్నమామా అడిగేవాళ్లకి సమా ధానం చెప్పలేక సిగ్గుతో చచ్చిపోతున్నారట. ఎంత బీదవాళ్లయినా చివరికి అల్లునికి రెండు నూల్లు యినా కుట్టించి పంపుతారు. వీళ్లు అదికూడా లేదు. కాబట్టి 'కావలిస్తే వాళ్లమ్మాయిని పిల్చుకు పోనీ గానీ—నువ్వు వెళ్లడానికి వీలులేదు' అంటు న్నారు. వాళ్ల మాట కాదని రావడం నాకూ యిష్టం లేదు. కాబట్టి సంక్రాంతికి మీ రెవరైనా వచ్చి పద్మను పిల్చుకు పోవచ్చు! నా విషయంలో మీ రన్యథా భావించవద్దు.

మీ అల్లుడు
లక్ష్మీనారాయణ."

చదవడం పూర్తికాగానే కాగితం మడిచి కవరులో పెట్టి ఎడక కుర్చీలో కూర్చొనివున్న భర్త ఒడిలో వేసింది సావిత్రమ్మ.

"చూశావా! తల్లిదండ్రుల ఆనతి తప్పలేని శ్రీరామచంద్రుడైన మీ అల్లుడుగారి అసలు రంగు. పైగా అన్యథా తలంచవద్దట . . తలంచవద్దు!!

పెళ్లి అయినాక కొత్త పండుగ యిదే కదా! ఈ సంక్రాంతికి పిల్చి, అన్నీ యిచ్చి పంపేద్దా మనుకున్నాముగానీ, యివ్వకూడ దనుకున్నానా ? ఆమాత్రం అచ్చటా—ముచ్చటా తీర్చాల్సిన అవసరం వుందని నాకు తెలీదూ ?—ఇవ్వకూడదనే ఉద్దేశమే గనుక వుండివుంటే, ఆరేడువందలు పెట్టి ఈ వెండిసామానూ, ఈ పరుపు చుట్టలూ, గుడ్డలూ అన్నీ తీసి వుంచేవాడినా ?—ఇంత సంకుచితత్వం మనసులో పెట్టుకునే కామోను! వాళ్లు ఆరోజు పెళ్లిలో ఏమీ అడగంది. ఏవో ఆదర్శాలు చెప్పుకొచ్చారు గొప్పగా. . . . ఇప్పు డీ జాబుచూస్తే నా ఒళ్లు మండుకుపోతోంది. అన్ని మర్యాదలూ చేసి, గౌరవంగా పంపిద్దామని రాస్తే, ఇదేనా వీ డిచ్చే జవాబు. ఈ వెధవ రాకపోతే 'సంక్రాంతి' సాగదనుకున్నాడు కామోను! . . . హు! . . ." అన్నాడు ఆవేశంకొద్దీ అంటున్న మాటల్ని ఆపి, వూపిరి పీల్చుకుంటూ జానకిరామయ్య.

"అబ్బ! ఏమిటండీ యీ చీదరింపులూ—ఛీత్కారాలూను. శుభమల్లే పండగ రోజుల్లో సంతోషంగా వుండక, అస్తమానూ మీకు వాళ్లని తిట్టిపొయ్యడంతోనే సరిపోతుందా ఏమిటి ?"

"చీదరించుకోకపోతే, నెత్తి నెక్కించుకోవే నాకెందు కొచ్చిన గొడవ యిదంతా. ఉన్నమాట చెబితే నీకేమో ఉక్రోషం ఉబుక్కొస్తుందే!—చెబుతున్నాగా! ఇక ఈ జన్మలో వాళ్లకి ఉత్తరం రాయడంగానీ,వెళ్లి బతిమాలుకోడంగానీ చెయ్యను. నీ కిష్టముంటేవెళ్లి కూతుర్ని పిల్చుకొచ్చుకో!"

"ఏంటన్నయ్యా ఒదినమీద విరుచుకు పడ్డట్టున్నావ్? పులుసులో ఉప్పుగానీ వెయ్యడం మర్చిపోలేదుగదా? మా వదినె బలే మతిమరుపు మనిషి" అంటూ రంగంలోకి ప్రవేశించింది ప్రక్కింటి సత్యవతి.

"అదికాదే సత్యా! అల్లుడు రాసిన ఉత్తరంచూసి ఈయనకు శివమెత్తింది. చిందులు తొక్కుతున్నారు" అంది సావిత్రమ్మ.

"నేనేమో శివమెత్తి చిందులుతొక్కుతున్నాను. కాళ్లకి గజ్జెలు కట్టుకుని నువ్వు కూడా రా నా జతకి ఆడుదూ గాని."

"ఇంతకీ అల్లుడు ఏం రాశా డేమిటమ్మా వదినా ?"

"అల్లుడికి అలంకారా లేమీ యివ్వలేదని వాళ్ల వాళ్లేమో పండక్కి నువ్వు వెళ్లడానికి వీల్లేదు, కావలిస్తే వాళ్లమ్మాయిని పిల్చుకుపోనీ అన్నారట. అదే రాశాడు."

"అంతేనా! ఆమాత్రానికే అన్నయ్య యిలా కోపం చేసుకున్నాడా ?—స్వయంగా వెళ్లి సంగతి సందర్భాలు చెప్పి, పండక్కి పిల్చుకొచ్చి అన్నీ యిచ్చి పంపేస్తే పోదూ ?"

"పోతుంది కాని, సత్యా ! ఈయన వెళ్లందే—ఎలా చక్కబడుతుంది చెప్పు ?"

"అవును అన్నయ్యా! వెళ్లవా ?"

"వెళ్లను. వాళ్లని బతిమాలుకోవాల్సినంత ఖర్మ నాకేం పట్టలేదు."

"అలా అంటే ఎలా అన్నయ్యా! మన బిడ్డ ముద్దు తీర్చడానికైనా వెళ్లాలి. పండక్కి కొత్త అల్లుడు యింట్లో వుంటే,యిల్లు కళగా వుంటుంది. వెళ్లి పిల్చుకురండి."

"అదేం కుదరదు చెల్లీ!"

"సరే!—యింక నేనేమీ చెప్పలేను—వదినా కాస్త కాఫీ గుండ యియ్యమ్మా! పొద్దున్న ఆయన బజారు వెళ్తున్నప్పుడు చెప్పడం మర్చిపోయాను. ఇప్పుడు చూస్తే, బొత్తిగా అయిపోయింది' అంటూ కాఫీ గుండ అడిగి తీసుకొని ఆమె వెళ్లిపోయింది.

"అయితే, యింక మీరు అల్లుణ్ణి పిల్చుకు రావటంగానీ—ఏమీ చెయ్యరన్నమాట." ఆ విషయా న్నంతటితో వదిలేసే యిష్టంలేక, భర్త ఉద్దేశం పూర్తిగా తెలుసుకుందామని అడిగింది సావిత్రమ్మ.

"ఊహూ!" అన్నాడు జానకిరామయ్య నిక్కచ్చిగా!

"అయితే, యివన్నీ ఎందుకు తీశారు. ఆరేడు వందలు డబ్బు దండుగ పెట్టి ?"


"అల్లుడుగారు యిలా రాస్తారని నే నేమన్నా కల గన్నానా ? అన్నీ యిచ్చి పంపుదామనే తీశాను. కానీ, తీరా యీ ఉత్తరం చూసేసరికి నా మనస్సు విరిగిపోయింది. అవన్నీ అలానే నాశనమైపోయినా సరే! నేను మాత్రం వెళ్లి పిల్చుకురాను."

"అంతేనంటారా ?"

"అంతే!—ఇక న న్నాట్టే వాగించక వెళ్లి నీ పనులు చూసుకో!" అంటూ కోపంగా అంగలూ—పంగలూ వేసుకుంటూ వెళ్లిపోయాడు జానకిరామయ్య.

★

నాన్న నడిగి ఈ పండక్కి తప్పకుండా హామికి పిందె. నెక్లెస్ చేయించుకోవాలనీ, నూరో, నూట పాతికో పెట్టి, ఓ మంచి చిలకపచ్చ రంగు పిల్కా చీర కొనిపించుకోవాలనీ, రెండు ఉంగరాలు చేయించుకోవాలనీ, వాటితోపాటు ఆటే రాధాకృష్ణుల బంగారు విగ్రహాలు—తను నిత్యం పూజించుకోటానికి—



పూజా మందిరంలో పెట్టుకుందుకి చేయించి యిమ్మని అడగాలనీ.... యిలా యింకా యెన్నెన్నో కోరికలతో వచ్చిన పద్మకు రైలు దిగగానే చాలా నిరాశ కల్గింది. "ఇంత ఆత్రంతో ఆకాంక్షతో అంత దూరాన్నుంచీ వస్తే, నాన్నగారు తనకోసం స్టేషనుకు బండీ అయినా పంపించక పోయి నందుకు ఆమెకు చాలా బాధ కల్గింది.

"ఏం పద్మా ! మీ నాన్న స్టేషనుకు బండీ పంపుతా నన్నావే? ఎక్కడ?" అన్నాడు లక్ష్మీ నారాయణ.

"మీరు రాసిన ఉత్తరం అందిందో—లేదో?"

"అందకపోవడ మేమిటి ? అందే వుంటుంది."

"అయితే బండీ ఎందుకు పంపించలేదు ?"

"అదే అర్థం కావటంలేదు."




—ఫోటో: శ్రీ పి. గురుమూర్తి

"అస లింతకూ మీరు, వస్తున్నట్లుగా జాబు రాశారో లేదో ?"

"ఇది మరీ బాగుంది. మీనాన్న బండీ పంపక పోయేప్పటికి నేనే దొంగనై పోయానన్నమాట!— ఏరా జనార్దన్ నువ్వు కాదూ మామయ్యకి రాసిన ఉత్తరం పోస్టు చేసింది ?"

"వూ!" అన్నాడు జనార్దన్ ముక్తసరిగా. అన్నతో కూడా అతడూ 'సంక్రాంతి' కి మామగారి ఊరు చూడటానికి వచ్చాడు.

లక్ష్మీనారాయణ యిక నుంచోలేక, ఓ జట్కా వాణ్ణి కేకేశాడు. జట్కా వచ్చి ఆగింది. జట్కావాలా సామానదీ బండిలోకి చేరేశాడు. ముగ్గురూ కూర్చున్నారు.

"అప్పారావు వీధి 1/84 నెం. యింటికి పోనీ," అన్నాడు లక్ష్మీనారాయణ.

యజమాని కేకతో గుర్రం పరుగు లంకించు కుంది. అర్ధగంటలో వెళ్లి 1/84 నెం. యింటి ముందు ఆగింది. అందరూ దిగారు. సామానదీ యింట్లోకి చేరేసి వచ్చాక వాడికి బాడుగ డబ్బి లిచ్చి, అందరూ యింట్లోకి వెళ్లారు.

జానకిరామయ్య డ్రెస్ వేసుకుని ఆఫీసుకు వెళ్ల డానికి సిద్ధంగా వున్నాడు. కూతురు, అల్లుడు రావడం చూసి, కూడా అతనేమీ పలకరించకుండానే వెళ్లిపోయాడు.

సావిత్రమ్మ కూడా సంతోషంగా లేదు. అల్లుడు, కూతురు వచ్చారని ఆమె ఆనందాన్ని కూడా ప్రక టించలేదు. ఇదివరకూ తనంటే ఎంతో ప్రేమగా చూసే తలిదండ్రులు ఈనాడు యిలా ముభా వంగా, మౌనంగా వుండడంవల్ల పద్మ చాలా బాధ పడసాగింది. సాయంకాల మవుతుండగా యిక బాధని దాచుకోలేక "ఏమ్మా! నువ్వూ నాన్నా తగూ లాడుకున్నారా ?" అని అడిగింది.

"లేదమ్మా! ఏమీ తగూలాడుకోలేదు!" అంది సావిత్రమ్మ.

"మరయితే ఎందు కిలా వున్నారు ? నాన్న గూడా నన్ను పలుకరించలేదే! మీరేకదా సంక్రాంతికి రమ్మని రాశారు. ఇప్పుడలా ముభావంగా వుంటే ఆయ నేమనుకుంటారు. ఆహ్వానించి అవమానం చేసినట్టు అనుకోరా ?"

"అనుకోనియ్యవమ్మా! ఆయన చేసిన అవమా నంలో ఇదేమాత్రం ?"

"ఆయ నేం అవమానం చేశారమ్మా ?"

"ఏం చేశారో ఆయన్నే అడుగు."

పద్మ యింక తల్లిని ఏమీ అడగలేక పోయింది. తన భర్త ఏం అవమానం చేశాడు ? ఏమిటిగంతా ? ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ముఖాన్ని చేతుల్తో కప్పుకుని అక్కడినుంచీ వెళ్లిపోయింది.

జానకిరామయ్య సాయంత్రం ఆఫీసునుంచి రాగానే "ఏమిటోయ్! వెళ్లడానికి వీల్లేదని చెప్పిన మీవాళ్లు మళ్లీ ఎలా వెళ్లమన్నారు ?" అని అడి గాడు. కుర్చీలో కూర్చొని 'ప్రభ' చదువుకుంటూన్న అల్లుణ్ణి ఉద్దేశించి అయిష్టంగానే.

"వెళ్లడానికి వీల్లేదన్నారా ?—లేదే! అగత్యంగా వెళ్లి రమ్మన్నారు గానీ, అలా అనలేదే!?" అన్నాడు తికమక పడిపోతూ లక్ష్మీనారాయణ మామగారి మాటలకు అర్థం తెలీక.

భర్త గొంతు విని సావిత్రమ్మ అక్కడి కొచ్చింది. తల్లి వెనకాలే పద్మ కూడా వచ్చి నిల్చుంది. జానకి రామయ్య మళ్లీ అడిగాడు.

"అనలేదూ ?"

"అయితే, నీ ఉత్తరంలో అలా ఎందుకు రాశావు ?"

"ఎలా రాశాను మావయ్యా ?"

"ఎలా రాశావో నువ్వే చూడు" అంటూ, జేబులో నుంచి ఓ కవరు తీసి అతని ముందు పడే శాడు."

లక్ష్మీనారాయణ తీసి చదువుకున్నాడు. అతని హృదయం కంపించి పోయింది. "మావయ్యా ఇది నేను రాసిన ఉత్తరం కాదు. కవరు మీది అడ్రసు మాత్రం నా దస్తూరిలాగే వుంది కానీ, ఉత్తరం మాత్రం ఎవరు రాశారో నాకు తెలీదు. నేనూ, తమ్ముడూ, పద్మ పన్నెండో తారీఖు బయలుదేరి వస్తున్నట్టు నేను రాసిన ఉత్తరం మీ కందలేదా?" అన్నాడు.

"ఇదొక్కటే నా కందింది" అన్నాడు జానకి రామయ్య.

ఇదంతా గమనిస్తూ, అంతదాకా ఎలాగో నవ్వు ఆపుకుంటూ వచ్చిన జనార్థన్ ఇక నవ్వాపుకోలేక, ఫక్కున నవ్వేశాడు. "మిమ్మల్నిలా ఉడికిద్దామనే ఉద్దేశంతో అదంతా నేను చేసిన పని మావయ్యా! 'అన్నయ్య కేమీ తెలీదు. ఆయన రాసిన ఉత్తరాన్ని తీసి జేబులో పెట్టుకుని, ఇందాకా మీరు అన్నయ్య చేతికిచ్చిన ఉత్తరాన్ని నేను రాసి అందులో వుంచి మీకు పోస్టు చేశాను. ఇదీ అసలు సంగతి!" ఇదిగో అన్నయ్య రాసిన ఉత్తరం. మీరు ఊరికినే ఆయన మీద అపోహ పడుతున్నారు" అన్నాడు.

లక్ష్మీనారాయణ, పద్మ, సావిత్రమ్మ అందరూ ఆశ్చర్యంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"వోరి గుంట వెధవా! ఎంతపని చేశావోయ్!" అన్నాడు జానకిరామయ్య పెదాలమీదికి చిరునవ్వు తెచ్చుకుంటూ.

★

కోడి కూతతో లేచి పద్మ పాత బుట్టలన్నీ పోగు పెట్టి, భోగి మంటలు వేసింది.

"వదినా! అన్నయ్యని కూడా లేపవా ? భోగి మంటలో చలి కాచుకోడమంటే, అన్నయ్యకి భలే సరదా !" అన్నాడు జనార్థన్.

"లేపుకురా" అంది పద్మ.

లక్ష్మీనారాయణతోపాటు, సావిత్రమ్మ, జానకి రామయ్య కూడా వచ్చి కూర్చున్నారు. భోగి మంటల వెచ్చదనంలో కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ, ఉదయం వరకూ గడిపి, సూర్యోదయ మవగానే సంక్రాంతి సంబరాల్లో మునిగిపోయారు.